## కుమార్తె పై అత్యాచారం కేసు

# తండ్రికి జీవిత ఖైదు

- బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం
- కేసు నమోదులో మహిళ కానిస్టేబుల్ చొరవ





**గుంటూరు లీగల్, మే 8 ప్రభాతవార్త:** జీవితాంతం అండగా ఉంటానంటూ ఓ మహిళకు దగ్గరై, ప్రేమ, సహజీవనం, వివాహం అనంతరం, ఆమెకు పుట్టిన 12 ఏళ్ల బాలికపై అత్యంత పాశవికంగా అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం శుక్రవారం సంచలనాత్మక తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం చిలకలూరిపేట, రెడ్ల బజారుకు చెందిన రాయపూడి శ్రీదేవికి 2006లో వివాహమై, ఒక పాప పుట్టాక భర్తతో విడిపోయింది. తిమ్మాపురం క్వార్టర్స్‌లో ఉంటుండగా 2009లో ఆప్రాంతానికి చెందిన పెయింటర్ రాయపూడి మరియదాసుతో పరిచయమై, ప్రేమగా మారి, కొంతకాలం సహజీవనం చేసిన అనంతరం వివాహం చేసుకున్నారు. శ్రీదేవికి కలిగిన కుమార్తె కూడా వీరితోనే కలిసి ఉండేది. శ్రీదేవి కూలి పనులకు వెళ్లిన సమయంలో బాలికపై మరియదాసు అత్యాచారానికి ప్రయత్నించేవాడు. రాయటానికి అవకాశం లేని అంశాలతో తీవ్రమైన అసభ్యకర ప్రవర్తనకు పాల్పడేవాడు. చాలాకాలం తల్లి శ్రీదేవికి ఈ విషయం తెలియలేదు. 2018 మార్చి నెలలో, ఒకరోజు ఇంటికి వచ్చిన తల్లికి నగ్న దృశ్యం కనపడటంతో భర్త మరియదాసును నిలదీసింది. తనకు దెయ్యం పట్టిందని, ఇలా ప్రవర్తించకూడదని క్షమాపణ కోరుకున్నాడు. పెద్దల సమక్షంలో పంచాయతీ కూడా జరిగింది.

**ధైర్యంగా కానిస్టేబుల్‌కు బాలిక సమాచారం:** వరుసకు తండ్రి తనపై శారీరక హింసకు గురిచేయడాన్ని తట్టుకోలేని బాలిక ధైర్యం చేసింది. అదే సమయంలో బాలిక చదివే స్కూల్లో చిలకలూరిపేట పోలీసులు పిల్లలకు "గుడ్ టచ్... బ్యాడ్ టచ్" అనే అంశంపై వివరిస్తున్నారు. తమ స్కూలుకు వచ్చిన పోలీసు టీంలోని మహిళా కానిస్టేబుల్ బిరుదు సరోజకు, ఈ బాలిక తనపై జరుగుతున్న ఆకృత్యాన్ని వివరించింది. ఆశ్చర్యపోయిన పోలీసులు 2019 ఆగస్టు 26వ తేదీన బాలిక నుండి, ఆమె తల్లి నుండి ఫిర్యాదు స్వీకరించి వాస్తవాలను రాబట్టారు. బాలికకు 10 ఏళ్ల వయసు నుండి మరియదాసు ఈ దుర్మార్గానికి పాల్పడుతున్నట్లు తేలింది. బాలిక నుండి పూర్తి విషయాలను కానిస్టేబుల్ సరోజ సేకరించగలిగారు. చిలకలూరిపేట పట్టణ ఎస్ఐ బి.శివరామయ్య కేసు నమోదు చేశారు. అప్పటి చిలకలూరిపేట సి.ఐ వి.సూర్యనారాయణ నిందితుడిని అరెస్ట్ చేశారు. సిఐ టి.వెంకటేశ్వర్లు చార్జిషీటు దాఖలు చేశారు. పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీగల దుర్గాప్రసాద్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో యావజీవ కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుల్తానా బేగం తీర్పు చెప్పారు. ఈ కేసులో బాధితురాలు అయిన మైనర్ బాలికకు, ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షల పరిహారం అందించాలని ఆదేశించారు.

# మహానాడు నిర్వహణకు 19 కమిటీలు

- మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో 10 మందితో సమన్వయ కమిటీ ఏర్పాటు



**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** మహానాడు నిర్వహణకు తెలుగుదేశం పార్టీ 19 కమిటీలను ఏర్పాటు చేసింది. సీనియర్లు, జూనియర్ల కలయికతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈనెల 27, 28,29 తేదీల్లో నెల్లూరు జిల్లాలోని ఇఫ్కో సెజ్ ప్రాంగణంలో మహానాడు నిర్వహించనున్నారు. దీని కోసం సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. "మహానాడు" నిర్వహణకు టిడిపి అధిష్ఠానం 19 కమిటీలను ఏర్పాటు వేసింది. ఈ క్రమంలో టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో 10 మందితో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి కో కన్వీనర్‌గా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులను నియమించింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ నేతృత్వంలో జనసమీకరణ కమిటీ ఏర్పాటు అయ్యింది. మంత్రులు ఎన్ఎండి ఫరూఖ్, అనగాని సత్యప్రసాద్, బిసి జనార్దన్‌రెడ్డి, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిలారు రాజేష్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, పార్టీ జోనల్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజులు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. పలు కమిటీల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల పార్టీ నేతలను భాగస్వాముల్ని చేశారు. తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడి నేతృత్వంలో తీర్మానాల కమిటీ ఏర్పాటు చేశారు. కో-కన్వీనర్లుగా ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాలవ శ్రీనివాసులు, పార్టీ నాలెడ్జ్ కమిటీ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి, మంత్రి సవిత, పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు, ఎంఏ షరీఫ్, వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు కళా వెంకట్రావు, కూన రవికుమార్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, ఎపి కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య, జీవవైవిధ్య బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్, నేతలు చిలువేరు కాశీనాథ్, సామా భూపాల్‌రెడ్డి, నెల్లూరి దుర్గాప్రసాద్‌లను సభ్యులుగా నియమించారు.

**ఎపి, టిజి కీలక నేతలతో ఆహ్వాన కమిటీ**

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు (తెలంగాణ), అండమాన్-నికోబార్ అధ్యక్షుడు మాణిక్యం యాదవ్‌లు కన్వీనర్లుగా ఆహ్వాన కమిటీని నియమించారు. పయ్యావుల కేశవ్ కన్వీనర్‌గా సభా నిర్వహణ కమిటీ ఏర్పాటు చేశారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు పలువులు నేతలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. మంత్రులను కమిటీలకు కన్వీనర్లుగా నియమించారు. మంత్రి అచ్చెన్నాయుడు కన్వీనర్‌గా వసతి ఏర్పాట్ల కమిటీ, బిసి జనార్దన్‌రెడ్డి కన్వీనర్‌గా భోజనాల ఏర్పాట్ల కమిటీ, హోంమంత్రి వంగలపూడి అనిత కన్వీనర్‌గా మీడియా కమిటీ, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కన్వీనర్‌గా ఆర్థిక వ్యవహారాల కమిటీ, గుమ్మిడి సంధ్యారాణి కన్వీనర్‌గా సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ, నిమ్మల రామానాయుడు కన్వీనర్‌గా సభా ప్రాంగణ పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు చిత్ర ప్రదర్శన, ప్రతినిధుల నమోదు, అలంకరణ, రవాణా, వాహన పార్కింగ్, రక్తదానం వైద్య క్యాంపు, వాలంటీర్ల నిర్వహణ, జనసమీకరణ, పరిశుభ్రత సుందరీకరణకు కమిటీలను ఏర్పాటు చేశారు.



## బ్యాటరీ దొంగల ముఠా గుట్టురట్టు

- ముగ్గురు అరెస్ట్, రూ.1.45 లక్షల సొత్తు స్వాధీనం

**నెల్లూరు క్రైమ్, మే 8 ప్రభాతవార్త:** నగరంలోని ఆటోనగర్ ప్రాంతంలో వరుసగా లారీ బ్యాటరీల దొంగతనాలకు పాల్పడుతూ లారీ యజమానులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ముఠాను వేదాయపాలెం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు, వారి వద్ద నుంచి భారీగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన వివరాలను శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర ఏఎస్పీ దీక్ష వెల్లడించారు.

**అసలేం జరిగిందంటే..!:** గత కొంతకాలంగా వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో రిపేర్ కోసం నిలిపి ఉంచిన లారీల నుండి బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారు. ఈ దొంగతనాలపై ఫిర్యాదులు రావడంతో జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సిహెచ్ సౌజన్య, టౌన్ ఏఎస్పీ దీక్షల పర్యవేక్షణలో వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, ఎస్ఐ యు.సాయి కళ్యాణ్ ఇతర సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో చంద్రబాబు నగర్ మెయిన్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. నిందితులు చింతగుంట వెంకటేశ్వర్లు (19), పారి నరసింహులు (21), ఇలగనూరు శ్రీనివాసులు(24) అని గుర్తించారు. నిందితులు ముగ్గురూ చెడు వ్యసనాలకు బానిసై, జల్సాల కోసం సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాల బాట పట్టారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు వీరు ఒక హ్యుందాయ్ ఐ20 కారును దొంగతనాల కోసం ఉపయోగించడం గమనార్హం. పోలీసులు నిందితుల నుంచి 14 లారీ బ్యాటరీలు, కారును స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.1,45,000లు ఉంటుందని తెలిపారు. కేసును అత్యంత వేగంగా ఛేదించిన వేదాయపాలెం పోలీసు బృందాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి రివార్డులు అందజేశారు.

## చెన్నూరులో యువకుడు హత్య



**గూడూరు రూరల్ (నెల్లూరు), మే 8 ప్రభాతవార్త:** గూడూరు మండలం చెన్నూరులో ఓ యువకుడు హత్యకు గురైన సంఘటన శుక్రవారం చోటుచేసు కుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు ఉత్తరప్రదేశ్‌కి చెందిన ఐదు మంది యువకులు తుంగ పాలెంలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేసేందుకు వచ్చారు. చెన్నూరులో ఈ ఐదు మంది యువకులు ఈనెల 5వ తేదీన ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. మరో రెండు రోజుల్లో కంపెనీలో పనికి వెళ్లేందుకు అక్కడ పనులను కుదిర్చే కాంట్రాక్టర్‌తో మాట్లాడుకున్నారు. ఇంతలో ఈ ఐదు మందిలో ఏం జరిగిందో ఏమో కానీ శుక్రవారం ఓ యువకుడు ఒంటిపై కత్తిపోట్లుతో హత్యకు గురై మృతి చెంది ఉండటాన్ని ఇంటి యజమాని గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలాన్ని ఏఎస్పీ సౌజన్య, ఇన్చార్జ్ డీఎస్పీ గిరిధర్, సిఐలు కిషోర్‌బాబు, శేఖర్‌బాబు, ఎస్ఐలు తిరుప తయ్య, శేఖర్ బాబులు పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## అమరావతి నడిబొడ్డున అంతర్జాతీయ ఆతిథ్యం

# రాజధానిలో గ్లోబల్ వైబ్స్

- కోర్టుయార్డ్ బై మారియట్ హోటల్‌కు మంత్రులు కందుల దుర్గేష్, టిజి భరత్ భూమి పూజ
- 175 గదులు, అత్యున్నత వసతులతో 2028 నాటికి అందుబాటులోకి రానున్న హోటల్



**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో పర్యాటక, పారిశ్రామిక రంగాలు సరికొత్త పుంతలు తొక్కుతున్నాయి. కృష్ణా తీరానికి సమీపంలో రాజధాని నడిబొడ్డున ప్రతిష్టాత్మక కోర్డుయార్డ్ బై మారియట్ హోటల్ ప్రాజెక్టుకు శుక్రవారం ఘనంగాభూమి పూజ నిర్వహించారు. సదరన్ గ్లోబ్ హోటల్స్ రిసార్ట్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పర్యాటక మంత్రి కదుల దుర్గేష్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందు దుర్గేష్ మాట్లాడుతూ ప్రజా రాజధాని అమరావతిలో అంతర్జాతీయ బ్రాండ్ అయిన మారియట్ హోటల్ శంకుస్థాపన జరగడం శుభపరిణామం. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ప్రకారం అమరావతిని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతున్న క్రమంలో ఇటువంటి భారీ ప్రాజెక్టులు పర్యాటక రంగానికి వెన్నెముకగా నిలుస్తాయి. మారియట్ గ్రూప్ ప్రమాణాలకు అనుగుణంగా 175 రూమ్స్, విశాలమైన స్విమ్మింగ్ పూల్, బ్యాంకెట్ హాల్, బిజినెస్ లాంజ్, మల్టీ కుజీన్ రెస్టారెంట్ తదితర సకల హంగులతో రాజధానికి వచ్చే అంతర్జాతీయ పర్యాటకులకు, వ్యాపార వేత్తలకు ఇది అత్యున్నత స్థాయి వసతిని కల్పిస్తుంది. అని పేర్కొన్నారు. తుళ్లూరు మండలం లింగాయ పాలంలోని ఏపీ సీఆర్డీయే కార్యాలయం ఎదురుగా నిర్మితమవు తున్న ఈ హోటల్ 2028 డిసెంబర్ నాటికి పూర్తిచేస్తామని హోటల్ ప్రతినిధులు వెల్లడించారు. అమరావతి లాంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో తాము ఈ హోటల్ నిర్మిస్తుండటం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. సదరన్ ట్రావెల్స్ గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, డెల్టా ప్యూర్ కంపెనీలు ఈ ప్రాజెక్టులో కీలక భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. రాజధాని ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి ఆతిథ్య రంగానికి ఈ ప్రాజెక్ట్ ఒక చిరునామాగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌పై ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రయాణికులు స్టాప్‌లో ఉన్న ఆగకుండా వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తే సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కృష్ణా జిల్లా కంకిపాడు సినిమా హాల్ సెంటర్‌లోని బస్టాప్‌లో పలువురు ప్రయాణికులు బస్సు కోసం వేచి చూస్తున్నారు. ఇంతలో అటుగా వచ్చిన ఓ ఆర్టీసీ బస్సు, ప్రయాణికులు ఉన్నప్పటికీ ఆగకుండా ముందుకు వెళ్లిపోయింది. అదే సమయంలో తన కారులో బస్సు వెనకే వస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఈ విషయాన్ని గమనించారు. వెంటనే ఆయన తన కారుతో బస్సును ఓవర్‌టేక్ చేసి అడ్డంగా ఆపారు. అనంతరం బస్సులోకి ఎక్కి డ్రైవర్, కండక్టర్‌ను నిలదీశారు. బస్టాప్‌లో ప్రయాణికులు ఎదురుచూస్తుంటే బస్సు ఎందుకు ఆపలేదని డ్రైవర్‌ను ఎమ్మెల్యే ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని, కానీ కొందరు ఆర్టీసీ సిబ్బంది తీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని మండిపడ్డారు. "బస్సు ఖాళీగానే ఉంది కదా, ఎందుకు ఆపలేదు? ఒకవేళ సీట్లు లేకపోతే ప్రయాణికులు నిల్చుని వస్తారు. మీరు బస్సులు ఆపకపోతే ప్రజలు ప్రభుత్వాన్ని తిట్టుకుంటారు. ఈ ఒక్కచోటే కాదు, చాలా ప్రాంతాల్లో ఇలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవర్, కండక్టర్ పొంతనలేని సమాధానాలు చెప్పి కవర్ చేసుకునేందుకు ప్రయత్నించగా తాను స్వయంగా చూశానని, బస్సు ఆపలేదనేది వాస్తవమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సిబ్బంది తీరు ఇలాగే ఉంటే ఫ్రీ బస్సు పథకం పెట్టినా ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకూడదని గట్టిగా హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గోసాల సెంటర్ వరకు అదే బస్సులో ప్రయాణించి, ప్రయాణికులతో మాట్లాడారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు ఉచిత బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అమరావతి అభివృద్ధిలో రైతులు భాగస్వాములు కావాలి

- సిఆర్‌డిఏ కమిషనర్ వి.విజయరామరాజు

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజారాజధాని అమరావతి నగర నిర్మాణాన్ని వేగవంతం చేసే చర్యల్లో భాగంగా లింగాయ పాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఎపిసిఆర్‌డిఏ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో ఎపిసిఆర్‌డిఏ కమిషనర్ వి.విజయరామరాజు పాల్గొని, భూసమీకరణ, గ్రామ కంఠం సమస్యల పరిష్కారం రైతులతో సుదర్ఘీంగా చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ రాజధానిలో చేపట్టిన రహదారులు ఎల్పీఎస్ జోన్ల అభివృద్ధి ప్రాజెక్టుల నిమిత్తం భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికి రైతులు ఇప్పటికీ భూసమీకరణ విధానంలో చేరే అవకాశం ఉందని స్పష్టం చేశారు. భూసేకరణ కంటే భూసమీకరణ ద్వారా రైతులకు మెరుగైన ప్రయోజనాలు చేకూరుతాయని కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## సచివాలయంపై డ్రోన్ అంటూ తప్పుడు ప్రచారం: ప్రభుత్వం సీరియస్

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కలెక్టర్ల సదస్సు జరుగుతున్న సమయంలో సచివాలయంపై డ్రోన్ కలకలం అంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకుంది. శాంతిభద్రతల దృష్ట్యా కీలకమైన సమయంలో ఇలాంటి పుకార్లు పుట్టించడం వెనుక కుట్ర కోణం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. సచివాలయంలో కలెక్టర్ల సదస్సు జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆకాశంలో కనిపించిన ఓ విమానాన్ని.. డ్రోన్‌గా చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు కలకలం రేపాయి. కలెక్టర్ల సదస్సు జరుగుతున్న వేళ భద్రతా వైఫల్యం జరిగిందంటూ విమర్శలు చేసే ప్రయత్నం చేశారు. అయితే, పోలీసుల విచారణలో అసలు నిజం బయటపడింది. ఢిల్లీ నుంచి విజయవాడ వస్తున్న ఎఐ2903 విమానాన్ని చూపించి, అది డ్రోన్ అంటూ తప్పుడు ప్రచారం చేశారని పోలీసులు నిర్ధారించారు. సదరు విమానం నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే ల్యాండింగ్ కోసం ఆ మార్గంలో ప్రయాణించిందని అధికారులు స్పష్టం చేశారు.

## హైకోర్టును ఆశ్రయించిన వెంకట్రామిరెడ్డి

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కె. వెంకట్రామిరెడ్డి తనను సర్వీసు నుంచి తొలగించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ నిర్ణయంపై న్యాయ పోరాటం చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో వెంకట్రామిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన, పంచాయతీరాజ్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో పాటు విచారణాధికారిగా వ్యవహరించిన కడప జిల్లా కలెక్టర్‌కు కూడా నోటీసులు పంపింది. తదుపరి విచారణను జూన్ నెలకు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ డి. రమేశ్ తెలిపారు. తనను ఉద్యోగం నుంచి తొలగిస్తూ జారీ చేసిన జిఓను రద్దు చేయాలని వెంకట్రామిరెడ్డి తన పిటిషన్‌లో కోరారు.

# వ్యవసాయ ఆక్వా వ్యర్థాలతో అద్భుత సంపద సృష్టి

- పశ్చిమ గోదావరి జిల్లా సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్‌ను ప్రశంసించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కలెక్టర్ల సదస్సులో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేసిన ప్రజెంటేషన్ సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్ అందరి దృష్టినీ విశేషంగా ఆకర్షించింది.

వ్యవసాయం, ఆక్వా రంగాల ద్వారా వచ్చే వ్యర్థాలను పర్యావరణానికి ముప్పుగా కాకుండా అత్యంత విలువైన బయో ఉత్పత్తులుగా సంపదగా ఎలా మార్చవచ్చో ఆమె తన ప్రజంటేషన్‌లో కళ్లకు కట్టినట్లు వివరించారు. పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయం పరంగా ఎంతో సంపన్నమైనదని, 2026 నాటికి తలసరి ఆదాయం రూ.3.5 లక్షలు దాటబోతోందని, కానీ పారిశ్రామిక రంగం మాత్రం కేవలం 16శాతం వాటాతో వెనుకబడి ఉందన్న వాస్తవాన్ని ఆమె సభ ముందు ఉంచారు. కేవలం వ్యవసాయంపైనే ఆధారపడకుండా, జిల్లాను పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చేయడానికి ఈ వ్యర్థాల నుంచి సంపద సృష్టించే మోడల్ ఒక గొప్ప పరిష్కారమని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పెండింగ్ సమస్యల పరిష్కారానికి 'ఒకనెల ఒకగ్రామం'

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త:** పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం కొత్తగా 'ఒకనెల-ఒకగ్రామం' పేరుతో కార్యక్రమం చేపట్టినట్లు అదనపు సిసిఎల్‌ఏ జె.వెంకటమురళి తెలిపారు. జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలో 'ఒకనెల-ఒకగ్రామం' నాలుగు పర్యటనలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మురళీ గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా మురళి మాట్లాడుతూ 'ఒకనెల-ఒకగ్రామం' కార్యక్రమం ద్వారా నెలకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామానికి అధికారుల బృందం వారానికి ఒకరోజు చొప్పున నాలుగు రోజులు పర్యటిస్తుందన్నారు. గ్రామంలోని ప్రజల సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు ఈకార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. గ్రామస్తుల నుండి వచ్చిన అర్జీలను నెలలోపు పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా రెవెన్యూ పెండింగ్ సమస్యలను పరిష్కరించటానికి ఈకార్యక్రమం దోహదపడుతుందన్నారు.

## హైకోర్టు జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ పదవీ విరమణ వీడ్కోలు



**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** హైకోర్టు న్యాయమూర్తి గన్నమనేని రామకృష్ణ ప్రసాద్‌కు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ఆధ్వర్యంలో ఫుల్ బెంచ్ ఘన వీడ్కోలు పలికారు. హైకోర్టు న్యాయమూర్తి గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ పదవీ విరమణ చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని వీడ్కోలు కార్యక్రమం హైకోర్టు మొదటి కోర్టు హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ నిబద్ధత కలిగిన జడ్జి అని కొనియాడారు. జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ ప్రకాశం జిల్లా కారంచేడులో జి.గాంధీ చౌదరి, విజయలక్ష్మీ దంపతులకు మే 28, 1964లో జన్మించారని, ప్రాథమిక విద్యాభ్యాసంను కారంచేడులో ఆపై గుంటూరులోని లొయోలా పబ్లిక్ స్కూల్లో పూర్తి చేసి, గుంటూరులోని ఎసి కాలేజీలో ఎల్ఎల్‌బి పూర్తి చేసి 1991లో బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. గుంటూరు న్యాయ కళాశాలలో న్యాయశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తూ సుప్రింకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు. ఫిబ్రవరి 14, 2022న ఎపి హైకోర్టు న్యాయమూర్తిగా నియామకం అయ్యారన్నారు. అనంతరం అడిషనల్ సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఎపి హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ ప్రభునాథ్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఎపి చైర్మన్ ద్వారకానాథ్ రెడ్డిలు జస్టిస్ జి.రామ్మృష్ణ ప్రసాద్‌కు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన విద్యార్థి దశ నుండి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రతి దశలోనూ ఉత్తమ సలహాలు అందించిన పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడిషనల్ అడ్వకేట్ జనరల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పలువురు న్యాయవాదులు జస్టిస్ జి. రామకృష్ణ ప్రసాద్‌కు

# మే 12న హనుమజ్జయంతి వేడుకలు

**ఇంద్రకీలాద్రి, మే 8 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై ఈనెల 12న ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. "హనుమజ్జయంతి" పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వైదిక కమిటీ వారి సూచనల మేరకు హనుమజ్జయంతి వేడుకలలో భాగంగా మంగళవారం ఉదయం 6 గంటల నుండి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఘాట్ రోడ్డులో వేంచేసియున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయం, అమ్మవారి ప్రధాన ఆలయ ప్రాంగణంలోని క్షేత్రపాలక శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం, మరియు మెట్ల మార్గంలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయాలలో ప్రత్యేక పూజలు జరుగుతా యన్నారు. ఈ మూడు ఆలయాల్లో స్వామివారికి 'అభిషేకములు', తమలపాకులతో "నాగవల్లీ దళార్చన" (ఆకుపూజ) శాస్త్రోక్తంగా నిర్వహిస్తారన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా మూడు ఆంజనేయ స్వామి ఆలయాలను రంగురంగుల పుష్పాలతో ప్రత్యేక పూల దండలతో శోభాయమానంగా అలంకరిస్తారన్నారు. భక్తులందరూ ఈ విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈవో కోరారు.

**ఇంద్రకీలాద్రిపై భక్తులకు మెరుగైన మౌలిక వసతులు:** ఇంద్రకీలాద్రిపై ప్రశాంతంగా అమ్మవారి దర్శనాల ఏర్పాట్లను ఈవో శీనా నాయక్ పర్యవేక్షి ంచారు. వేసవి సెలవులు, శుక్రవారం అయినప్పటికీ, ఈరోజు భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఇఓ క్షేత్రస్థాయిలో పర్యటించి ఆలయ ప్రాంగణంలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన పాలకొండ తులసి రాంబాబు రమాదేవి దంపతులు శుక్రవారం రూ.1,01,116ల విరాళం అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి, అనంతరం వేదపండితులతో ఆశీర్వచనం చేయించారు. వారికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని బహూకరించారు.



పలు విభాగాలు పరిశీలిస్తున్న ఇఓ శీనా నాయక్

## తాలీం-ఏ-హునూర్‌కు 3వేల దరఖాస్తులు

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త:** దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు చేపట్టిన తాలీం-ఏ-హునూర్ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విశేషస్పందన లభిస్తున్నదని, కార్యక్రమం ప్రకటించిన మూడురోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 3వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు కార్పోరేట్ కళాశాలలో ఉచితంగా ఇంటర్‌మీడియట్ విద్యను అందించటంతో పాటు, నీట్, ఐఐటి, జెఇఇ వంటి పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారు. ప్రతిభ కలిగిన విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డుకాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అలోచనతో ఈకార్యక్రమాన్ని కొత్తగా ఈఏడాది చేపట్టినట్లు చెప్పారు. 2026-27 విద్యాసంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహించి వారిలో మెరిట్ విద్యార్థులకు అవకాశం కల్పిస్తామన్నారు. మొత్తం 250 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామని, ఇందులో బాలికలకు 30శాతం రిజర్వేషన్ ఇస్తున్నట్లు వివరించారు. ఆసక్తికల విద్యార్థులు ఈనెల 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అజీజ్ సూచించారు.

# తిరుమల సమాచారం



## భక్తులకు మెరుగైన సౌకర్యాలు

### ● శ్రీవారి సేవలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

**తిరుమల, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతిరోజూ లక్షమంది వరకు వస్తున్న భక్తులకు టిటిడి అధికారులు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని, స్వామివారి దర్శనం మెరుగైందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తెలిపింది. శుక్రవారం ఉదయం తిరుమలకు చేరుకున్న ఈకమిటీ సభ్యులు ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడంలో తుడ చేపడుతున్న అభివృద్ధి పనులను, హౌసింగ్, అర్బన్ ప్లానింగ్‌లో అనుసరిస్తున్న విధానాలను పార్లమెంటరీ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సేవల విభాగం, లోక్ సభ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, లోక్ సభ సభ్యులు, ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, ఎంపియుఎండి డి.కరుణ, స్వచ్ఛఆంధ్ర ఎండి బి.అనిల్ కుమార్ రెడ్డి, టిటిడి బోర్డు సభ్యుడు సి.దివాకర్‌రెడ్డి ఉన్నారు.



## శ్రీవారి సేవలో జమ్మూకాశ్మీర్ గవర్నర్ మనోజ్‌సిన్హా

**తిరుమల, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగురాష్ట్రాల్లోని, జమ్మూకాశ్మీర్ ప్రజలకు అంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా స్వామివారిని ప్రార్థించారు. శుక్రవారం ఉదయం ఆయన అధికారులతో కలసి తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ ఇఒ ముద్దాడ రవిచంద్ర, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, డిప్యూటీ ఇఒ భాస్కర్ స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వైభవంగా వేదనారాయణుని రథోత్సవం

### ● భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగిన భక్తజనం



**తిరుమల, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న తిరుపతి జిల్లా నాగలాపురంలోని వేదనారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రథోత్సవం భక్తి పారవశ్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాలు, భజనల నడుమ స్వామివారి రథయాత్ర గ్రామ వీధులను ఆధ్యాత్మిక కాంతులతో నింపింది. ఉదయం 6.25 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణ స్వామి మహారథాన్ని అధిష్ఠించి నాలుగు మాడ వీధుల్లో విహరించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజన బృందాల నృత్యాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. "గోవిందా.. గోవిందా.." నామస్మరణల మధ్య భక్తులు భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. రథం యథాస్థానానికి చేరుకున్న అనంతరం వేదపారాయణం, ప్రబంధం, శాత్తుమొర నిర్వహించి మహాహారతి సమర్పించారు. రథోత్సవం ఆధ్యాత్మికంగా విశిష్టమైన తత్వాన్ని తెలియజేస్తుంది. శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, ఆత్మ రథికుడనే భావన ద్వారా ఆత్మానాత్మ వివేకాన్ని ఈ ఉత్సవం భక్తులకు బోధిస్తుంది. ఆ తరువాత మధ్యాహ్నం 12గంటల వరకు స్వామివారు, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఆలయ అధికారులు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఇన్‌స్పెక్టర్ చెంగల్ రాయులు, భక్తులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### ● తిరుపతి తాతయ్యగుంట గంగమ్మకు సారె సమర్పించిన మంత్రి సత్యకుమార్

**తిరుపతి, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుపతినగరంలో గ్రామదేవతగా కొలువై భక్తుల పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, గంగమ్మ ఆశీస్సులతో సకాలంగా వర్షాలు కురవాలని ప్రార్థించినట్లు తెలిపారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర సందర్భంగా రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం ఉదయం ఆలయం వద్దకు చేరుకున్నారు. ఇక్కడ ఆయన స్వయంగా తలపై సారెను తీసుకుని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఆలయ ఇఒ జయకుమార్, అర్చకులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి వెంట తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా బిజెపి నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, అనూష రామకృష్ణ, దీపక్ యాదవ్, చంద్రశేఖర్ రాయల్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, సాయిప్రసాద్, వరప్రసాద్, భాస్కర్, నవీన్ రాయల్, రెడ్డి బాబు, పార్థసారథి, మల్ల కుప్పం శేఖర్ పాల్గొని గంగమ్మకు సారె సమర్పించారు.



# సత్యసాయిబాబాకు మాటిచ్చా!

### ● సత్యసాయి స్కీముల మెయింటెనెన్స్‌కు నిధులు ఇవ్వాల్సిందే
### ● సీనియర్ ఐఏఎస్ అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు
### ● జిల్లా కలెక్టర్ ఆనంద్ లేవనెత్తిన సమస్యపై స్పందించిన సిఎం





**అనంతపురం, మే 8 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి మంచినీటి పథకాల నిర్వహణ బాధ్యత ప్రభుత్వానిదే. నేను అప్పట్లో సిఎంగా ఉన్నప్పుడు పుట్టపర్తి సత్యసాయి బాబాకు మాటిచ్చాను. సత్యసాయి స్కీముల నిర్వహణకు ఏదో స్కీం కింద నిధులు ఇవ్వాల్సిందే అంటూ సీనియర్ ఐఏఎస్ అధికారులను శుక్రవారం అమరావతిలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేయడం విశేషం. ఆసక్తికరంగా సాగిన అధికారుల చర్చలో సిఎం చంద్రబాబు స్పందన అభినందనీయం. వివరాల్లోకి వెళ్తే.. కలెక్టర్ల సమావేశంలో అనంతపురం తాగునీటి సమస్యలపై అనంతపురం కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ "సార్, అనంతపురంలో తాగునీటి సమస్యల గురించి. మనకు అక్కడ సత్యసాయి వాటర్ సప్లయ్ బోర్డు, రూరల్ వాటర్ సప్లయ్‌కి సంబంధించిన చాలా స్కీమ్స్ ఉన్నాయి. వాటికి సంబంధించిన పేమెంట్స్ అన్నీ కూడా రూరల్ లోకల్ బాడీస్ లేదా అర్బన్ లోకల్ బాడీస్ ద్వారా జరగాలి. కానీ వారి దగ్గర నుండి పేమెంట్స్ క్రమం తప్పకుండా రావడం లేదు. దీనివల్ల తాము ప్రాపర్‌గా మంచినీటి పథకాల నిర్వహణ పనులు చేపట్టలేకపోతున్నాం. ఈ వేసవి కాలంలో ఇది ఇబ్బందిగా మారుతోంది. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ విభాగాలకు తగిన ఆదేశాలు ఇస్తే, ఒక సెంట్రలైజ్డ్ లెవెల్‌లో ఆ నిధులను ఆర్.డబ్ల్యూ.ఎస్‌కి కేటాయిస్తే బాగుంటుంది" అని విజ్ఞప్తి చేశారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ సీనియర్ ఐఏఎస్ అధికారులు శశిభూషణ్‌ను చూస్తూ "దీనిపై మీరు వర్క్ చేయండి. మీరు ఈ స్కీమ్‌ను టేకాఫ్ చేయండి. సెంట్రలైజ్డ్‌గా ఉండాలి, జిల్లా పరిషత్ జోక్యం లేకుండా ఒక అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వాళ్లకు నీళ్లు అందేలా చూడాలి" అని ఆదేశించారు. ఆ సమయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య అధికారి శశిభూషణ్ స్పందిస్తూ "తప్పకుండా సార్, అనంతపురం కలెక్టర్ కోరిన విధంగా తగిన పరిష్కారం చూపిస్తాం. ప్రస్తుతం మా పని తీరుకు ఇది కొంచెం భిన్నంగా ఉన్నప్పటికీ ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ కూడా దీనికి అంగీకరించారు. ఒక మంచి పరిష్కారం కనుగొంటాం" అని సమాధానం ఇచ్చారు. దీనిపై సిఎం చంద్రబాబు మళ్లీ జోక్యం చేసుకుంటూ "చూడండి, నాకు ఇవేమీ తెలియవు. పుట్టపర్తి సత్యసాయిబాబా ప్రత్యేక చొరవతో శ్రీ సత్యసాయి మంచినీటి ప్రాజెక్ట్ ప్రారంభించే ముందు నన్ను పిలిచి ఒకటే రిక్వెస్ట్ చేశారు. "నేను ఎంతో కష్టపడి ఈ ప్రాజెక్ట్ కట్టాను, దీని మెయింటెనెన్స్ బాధ్యత మీరే తీసుకోవాలి" అని అడిగారు. అప్పుడు నేను సత్యసాయి బాబాకు మాట ఇచ్చాను, మీరు ప్రాజెక్ట్ కడితే నీళ్లు ఇచ్చే బాధ్యత, మెయింటెనెన్స్ బాధ్యత నేను తీసుకుంటానని చెప్పాను. అది నా కమిట్‌మెంట్. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు చోట్ల ఇటువంటి ప్రాజెక్టులు కట్టారు. ఇక్కడ, మహబూబ్‌నగర్, మెదక్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సత్యసాయి మంచినీటి పథకాలను అమలు చేశారు. గత ప్రభుత్వంలో దీన్ని సరిగ్గా మెయింటైన్ చేయకుండా అంతా గందరగోళం చేశారు. ఇకపై అలా జరగకూడదు. పాత సిస్టమ్‌నే మళ్లీ పునరుద్ధరించండి. అవసరమైన నిధులు విడుదల చేయండి అంటూ సిఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సమావేశంలో రాష్ట్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ చొరవతో సమస్యలను దృష్టికి తీసుకెళ్లడం సిఎం స్పందించడం విశేషంగా చెప్పొచ్చు.







## భూసమస్యల పరిష్కారంలో డిజిటల్ విప్లవం

### ● బ్లాక్ చైన్ టెక్నాలజీతో రికార్డులకు పూర్తి భద్రత: భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మీ

**సచివాలయం, మే 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో భూముల సర్వే, రికార్డుల డిజిటలైజేషన్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సరికొత్త సంస్కరణలను కలెక్టర్ల సదస్సులో శుక్రవారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మీ సవివరంగా వివరించారు. 'రీసర్వే 2.0'లో తీసుకొచ్చిన మార్పుల గురించి చెబుతూ, భూముల సర్వే సమయంలో పూర్తి పారదర్శకత కోసం ఇకపై క్షేత్రస్థాయి పరిశీలన, 9(2) నోటీసుల జారీ దశల్లో భూ యజమానులకు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా 'ఇ-కెవైసి విధానాన్ని అమలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ముసాయిదా పట్టాదారు పాస్‌బుక్‌ల తయారీకి కూడి యజమానులు నుండి నేరుగా ఇ-కెవైసి తీసుకుంటామన్నారు. గతంలో ఒక్కో గ్రామంలో సర్వే పూర్తి చేయడానికి 135 రోజులు మాత్రమే ఉండగా, పనులు మరింత పకడ్బందీగా తప్పుల్లేకుండా జరగాలనే ఉద్దేశ్యంతో ఆ గడువును 223రోజులకు పెంచినట్లు స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో 2027 మార్చి నెలాఖరు నాటికి లక్ష్యాల మేరకు పట్టాదారు పాస్ బుక్‌ల పంపిణీ వంద శాతం పూర్తి చేయడానికి పక్కా కార్యాచరణ సిద్ధం చేశామని కలెక్టర్లకు భరోసా ఇచ్చారు. దశాబ్దాల నాటి పాత రెవెన్యూ రికార్డులను అత్యంత సురక్షితంగా భద్రపరచడంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని జయలక్ష్మీ పంచుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ టెక్నాలజీ ద్వారా డేటాను సులభంగా విశ్లేషించి, అధికారులు అడిగిన వెంటనే నిమిషాల్లో వెతుక్కునేలా పాత రికార్డులన్నింటినీ డిజిటలైజ్ చేస్తున్నామన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అత్యంత తక్కువ ఖర్చుతో పైలట్ ప్రాజెక్టుగా ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేశామని ఆమె సగర్వంగా చెప్పారు. ఇదే స్ఫూర్తితో మాన్యువల్ 1బి రిజిస్టర్లు, పాత అడంగళ్ళు, 10-1రిజిస్టర్ డిజిటలైజేషన్ పనుల మొదటి దశను జులై 31, 2026కల్లా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇక భూముల రికార్డుల భద్రత కోసం ప్రభుత్వ చరిత్రలోనే తొలిసారిగా అత్యాధునాతన బ్లాక్ చైన్ టెక్నాలజీని తీసుకొస్తున్నామని ఆమె వెల్లడించారు. ఈ అధునాతన విధానం ద్వారా భూముల వివరాల్లో భవిష్యత్తులో ఎటువంటి తారుమారు జరగకుండా, అందరికీ ఒకే ఖచ్చితమైన సమాచారం (సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్) అందుబాటులో ఉంటుందని, బెంగళూరు ఎన్ఐసి సహకారంతో ఇప్పటికే 5గ్రామాల్లో ఈ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

భూ వివాదాల పరిష్కారం, ప్రజల ఫిర్యాదుల పట్ల కూడా రెవెన్యూ శాఖ ఎంతో బాధ్యతగా పనిచేస్తుందని ఆమె గణాంకాలతో వివరించారు. ముఖ్యంగా సెక్షన్ 22ఏ కింద ఉన్న వివాదాస్పద భూముల కేసుల పరిష్కారంలో అనంతపురం 851కేసులు, కృష్ణా 353, శ్రీకాకుళం 332, జిల్లాలు అత్యుత్తమ పనితీరు కనబరిచాయని కలెక్టర్లను అభినందించారు. అయితే అన్నమయ్య 433, ప్రకాశం 416, మార్కాపురం 408 జిల్లాల్లో ఈ దరఖాస్తులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించేలా ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఇక రాష్ట్రస్థాయి పబ్లిక్ గ్రీవెన్స్ (పిజిఆర్ఎస్-మీకోసం) పరిష్కారంలో రెవెన్యూ శాఖ పనితీరు అద్భుతంగా మెరుగుపడిందని అన్నారు. ప్రజల సమస్యలను అత్యంత వేగంగా, నాణ్యంగా పరిష్కరించడం వల్లే రాష్ట్రస్థాయిలో రెవెన్యూ శాఖ ర్యాంకు 11వ స్థానం నుండి ఏకంగా 4వ స్థానానికి ఎగబాకిందని వివరిస్తూ, ఈ అద్భుతమైన పనితీరును ఇలాగే కొనసాగిస్తూ భూ సమస్యల్లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

## వేగంగా గృహ నిర్మాణాలు

### ● రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ స్పెషల్ సిఎస్ అజయ్ జైన్

**సచివాలయం, మే 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గృహ నిర్మాణ కార్యక్రమాల అమల్లో భాగంగా 2015-16నుంచి ఇప్పటివరకు పిఎంఎవై అర్బన్, పిఎంఎవై గ్రామీణ, పిఎంజన్మన్ తదితర పథకాల క్రింద మొత్తం 17.67లక్షల ఇళ్ళకు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఏడవ కలెక్టర్ల సమావేశంలో గృహ నిర్మాణ శాఖ స్పెషల్ సీఎస్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాత్రమే 5.81లక్షల ఇళ్ళు పూర్తి కాగా, మొత్తం పూర్తైన ఇళ్ళ సంఖ్య 13.09లక్షలకు చేరిందని వెల్లడించారు. ప్రస్తుతం మరో 4.86లక్షల ఇళ్ళు నిర్మాణ దశలో ఉండగా, 01.06.2024 నుంచి ఇప్పటివరకు రూ.19,708.86 కోట్ల వ్యయం జరిగినట్లు పేర్కొన్నారు. పిఎంఏవై అర్బన్ బెనిఫిషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్ కింద 13.21లక్షల ఇళ్ళల్లో 9.86లక్షల ఇళ్ళు పూర్తయ్యాయని, పిఎంఏవై-ఏహెచ్‌పి కింద 2.61లక్షల ఇళ్ళల్లో 1.88లక్షల ఇళ్ళు పూర్తియ్యాయని వివరించారు. అలాగే పిఎంఏవై గ్రామీణ పథకం కింద 1.77లక్షల ఇళ్ళలో 1.15లక్షల ఇళ్ళు, పిఎంజన్మన్ కింద 36,932 ఇళ్లలో 19,963ఇళ్ళు పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాల వారీగా గృహ నిర్మాణ పురోగతిని వివరిస్తూ చిత్తూరు, అనకాపల్లి, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలు అత్యుత్తమ ప్రగతి కనబరిచినట్లు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో 89శాతం గృహాలు పూర్తికాగా, అనకాపల్లిలో 84శాతం, శ్రీకాకుళంలో 83శాతం గృహాలు పూర్తయ్యాయి. మరోవైపు పోలవరం, బాపట్ల ఎన్టీఆర్, ఏలూరు, కర్నూలు జిల్లాల్లో పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. 2026డిసెంబర్ నాటికి నిర్మాణంలో ఉన్న 4.88లక్షల ఇళ్ళను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు లక్ష్యాలు నిర్దేశించడం జరిగింది. పిఎంఏవై 1.0కింద చేపట్టిన ఇళ్లలో మెటీరియల్ రీకన్సిలియేషన్, నాణ్యత లోపాల సవరణను పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల జాబితాలను స్వర్ణగ్రామం, స్వర్ణవార్డు కార్యాలయాల్లో ప్రదర్శించాలని, హౌసింగ్ శాఖపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందేలా తక్కువ పనితీరు ఉన్న సచివాలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, హౌసింగ్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఒలు తదితర శాఖలతో నిరంతర సమీక్షలు నిర్వహించడంతోపాటు, ఫీల్డ్ విజిట్లు చేసి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడాలని కలెక్టర్లకు సూచించారు. గృహ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అనుసంధానంతో దశలవారీగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.

## పట్టణ మౌలిక వసతులు మెరుగ్గా కల్పించాలి

### వీధి వ్యాపారులకు రూ.15.69 కోట్లు మంజూరు

**తిరుమల, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నగరంతోబాటు దేశంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సూచించింది. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడంలో తుడా చేపడుతున్న అభివృద్ధి పనులను, హౌసింగ్ అర్బన్ ప్లానింగ్‌లో అనుసరిస్తున్న విధానాలను పార్లమెంటరీ కమిటీ సభ్యులు అభినందించారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ కమిటీ తిరుపతిలోని ఓ హోటల్‌లో సమావేశమైంది. పార్లమెంటరీ కమిటీ అధ్యయన పర్యటనలో భాగంగా నిర్వహించిన సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ శాఖ, అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖకు చెందిన పథకాల అమలు పురోగతిపై సమీక్షించారు.





అమృత్, అమృత్ 2, స్వచ్ఛభారత్ మిషన్, ప్రధానమంత్రి అవాజ్‌యోజన కార్యక్రమాలపై చర్చించారు.

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, ఇతర పట్టణ స్థానిక సంస్థల మానవ వనరుల సామర్థ్యం, ఆదాయ వనరుల సమీకరణ, బడ్జెట్ నిర్వహణ అంశాలపై ప్రత్యేక సమీక్ష చేశారు. తిరుపతి వంటి వారసత్వ ఆధ్యాత్మిక నగరాల స్థిరమైన పట్టణాభివృద్ధి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్లమ్ పునర్వ్యవస్థీకరణ, పునరావాస కార్యక్రమాల అమలు తదితర అంశాలపై కూడా చర్చలు జరిపారు.

ఈ ఉన్నత స్థాయి సమావేశంలో లోక్ సభ ఛైర్మన్, ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, లోక్ సభ మెంబర్లు, ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, మెప్మా ఎండి డి.కరుణ, స్వచ్ఛాంధ్ర ఎండి బి.అనిల్ కుమార్ రెడ్డి, టిడ్కో ఎండి ప్రభాకర్, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, తుడ ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి, తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ గోవింద రావు, నగరపాలక కమిషనర్ శారదాదేవి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## రాయలసీమకు 'రాయల్ కళ'





**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమకు "రాయల్ కళ" వస్తోందని ప్రతిబింబించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాయల సీమ ఇక రాయల్ సీమని శ్లాఘించారు. ఆ దిశలో సామాజిక మాధ్యమంలో ఓ పోస్టు పెట్టారు. రాయల సీమకు "రాయల్" కళ వస్తోందని ప్రతిబింబించేలా చంద్రబాబు పోస్ట్ ఉంది. పోస్టులో ఆయన ట్యాగ్ చేసిన మోటారు సైకిల్ నూతన వర్షన్‌లో ఆకర్షణీయంగా ఉంది, రాయలసీమ "రాయల్" సీమ అంటూ సిఎం ఈ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. దిగ్గజ మోటార్ సైకిల్ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ తిరుపతిలో భారీ పెట్టుబడులకు సిద్ధవ్వగా ఇక రాయల్‌సీమ అంటూ సిఎం రాసుకొచ్చారు. నిజానికి ఈ పోస్టులో బండి అందరంగా ఉంది.

# వేసవి సెలవుల్లోనూ తిరుమలలో భక్తులకు విస్తృత వసతి

### ● అందుబాటులోకి పిఏసిలలో లాకర్లు, విశ్రాంతి హాళ్లు





**తిరుమల, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు ప్రతిరోజూ ప్రపంచ నలుమూలల నుండి వేలాది మంది భక్తులు తిరుమలకు విచ్చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం విస్తృత స్థాయిలో వసతి, విశ్రాంతి, లాకర్, స్నాన, అన్నప్రసాదం తదితర సదుపాయాలను కల్పిస్తోంది. భక్తులు దర్శనానికి ముందు తిరుమలకు చేరుకుంటే స్నానమాచరించి పవిత్రంగా స్వామివారి దర్శనానికి వెళ్లడం ఆనవాయితీ. భక్తుల ఆచారాలు మనోభావాలను దృష్టిలో ఉంచుకుని తిరుమల, తిరుపతిలో అనేక వసతి గదులు, యాత్రికుల వసతి సముదాయాలను టిటిడి నిర్మించింది.

**గదుల కేటాయింపు విధానం:** తిరుమలలో వసతి గదులు పొందదలచిన భక్తులు సిఆర్‌ఒ జనరల్ కౌంటరులో ఆధార్ కార్డు, ఫోన్ నంబరు తదితర వివరాలను నమోదు చేసుకోవాలి. అనంతరం కేటాయించబడిన గది నంబరు, ఆ ప్రాంత వివరాలు ఎస్ఎంఎస్ ద్వారా భక్తులకు పంపబడతాయి. భక్తులు సంబంధిత ఉప విచారణ కార్యాలయంలో యూపీఐ/కార్డు ద్వారా చెల్లింపు చేసి గదిని పొందవచ్చు. తిరుమలలో స్థలాభావం కారణంగా 7,800 వసతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నందున, కుటుంబాలతో వచ్చిన భక్తులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. ఒంటరి, అవివాహిత స్త్రీ, పురుష జంటలకు గదులు కేటాయించడంలేదు. వసతి గదులు లభించని భక్తుల కోసం తిరుమలలో ఐదు యాత్రికుల వసతి సముదాయాలను టిటిడి ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాలలో భక్తులు ఆధార్ కార్డు, ఫోన్ నంబరు నమోదు చేసి ఉచిత లాకర్లు, ఇతర సౌకర్యాలను పొందవచ్చు.

**సిఆర్‌ఒ సమీపంలోని పిఎసి1:** గోవర్ధన్ సత్రం ఎదురుగా ఉన్న ఈ సముదాయంలో నాలుగుహాళ్లు, 1,256 లాకర్లు ఉన్నాయి. ప్రస్తుతం పునరుద్ధరణ పనుల కారణంగా 870 లాకర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అన్నప్రసాదం సౌకర్యం ఉంది.

**పిఎసి 2 (మాధవ నిలయం):** బాలాజీ బస్ స్టాండ్ ఎదురుగా ఉన్న ఈ సముదాయంలో 12 హాళ్లు, 3,300 లాకర్లు ఉన్నాయి. అన్నప్రసాదం, తలనీలాలు సమర్పించే సదుపాయం, ప్రథమ చికిత్స కేంద్రం, విశ్రాంతి సదుపాయాలు కల్పించబడ్డాయి.

**పిఎసి 3:** జీఎన్సీ టోల్ గేట్ నుండి రాంభగీచా బస్ స్టాండ్‌కు వెళ్లే ఔటర్ రింగ్ రోడ్డులో ఉన్న ఈ భవనంలో 9 హాళ్లు, 1420 లాకర్లు ఉన్నాయి. తలనీలాలు సమర్పించే సదుపాయం, విశ్రాంతి సౌకర్యం కలదు.

**పద్మనాభ నిలయం:** బాలాజీ బస్ స్టాండ్ లోపల ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో మూడు హాళ్లు, 960 లాకర్లు ఉన్నాయి. ఇక్కడ విశ్రాంతి, లాకర్, స్నాన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

**పిఎసి5 (వేంకటాద్రి నిలయం):** భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ఈ ఆధునిక సముదాయాన్ని 2025 సెప్టెంబర్ 25న ప్రారంభించారు. ఈ భవనంలో 16 హాళ్లు, 2400 లాకర్లు ఉన్నాయి. అన్నప్రసాదం, తలనీలాలు సమర్పణ, ప్రథమ చికిత్స, విశ్రాంతి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

**భక్తులకు అందుబాటులో 9,336 ఉచిత లాకర్లు:** తిరుమలలోని ఈ ఐదు యాత్రికుల వసతి సముదాయాలన్నింటిలో కలిపి మొత్తం ఉన్నాయి. భక్తులు తమ విలువైన వస్తువులను భద్రపరచుకోవడానికి వీటిని వినియోగించుకోవచ్చు. ఈ కేంద్రాలలో ఉచిత వేడి నీటి స్నాన గదులు, మరుగుదొడ్లు, చాపలు, రగ్గులు, అన్నప్రసాదం, తలనీలాలు సమర్పించే సదుపాయం, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం భక్తులు లాకర్లు ఖాళీ చేసి, తీసుకున్న చాపలు, రగ్గులు తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. భక్తులు ఈ యాత్రికుల వసతి సముదాయాలను వినియోగించుకుని స్వామివారి దర్శనాన్ని సుఖసంతోషాలతో పూర్తి చేసుకోవాలని, దర్శనం అనంతరం గదులు, లాకర్లు వెంటనే ఖాళీ చేసి ఇతర భక్తులకు కూడా అవకాశం కల్పించాలని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది.